www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబరు 2022
5
పశ్చిమ గోదావరి



సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

సిఐ వి.సురేష్‌బాబు



ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రలోభాలకు గురై సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని సిఐ వాడపల్లి సురేష్‌బాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే జాప్యం చేయకుండా వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఆయా బ్యాంకులకు సంబంధించి ఖాతా ఎక్కడ ఉంటే అక్కడ వెంటనే సంప్రదించి సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతున్నాయని, వాటి బారిన పడొద్దని సూచించారు.


వేడెక్కుతున్న రాజకీయం..!

అధినేతల పర్యటనలతో జిల్లాలో ఎన్నికల కాక
సిఎం పర్యటనకు పోటీగా చంద్రబాబు టూర్
త్వరలోనే జనసేన అధ్యక్షుడు పవన్ పర్యటించే అవకాశం
ఇప్పటి నుంచే కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేస్తున్న అధినేతలు
ప్రతిపక్షాలకు ఆయుధంగా ధాన్యం కొనుగోళ్లు, ఆక్వా ధర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏడాదిన్నరకు ముందే జిల్లాలో ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రధాన పార్టీల అధినేతల జిల్లా పర్యటనలతో జిల్లా రాజకీయం రోజురోజుకీ వేడెక్కుతోంది. పార్టీ కేడర్‌లో కొత్త జోష్ నింపి ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఇప్పటి నుంచే అధినేతలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే పార్టీ అధినేతలు జిల్లాలకు వస్తున్నారు. ఇప్పటికే సిఎం జగన్ జిల్లా పర్యటన పూర్తవగా ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజులపాటు చంద్రబాబు జిల్లా పర్యటన ఖరారైంది. త్వరలోనే జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సైతం జిల్లాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అధినేతల పర్యటనలతో ఆయా పార్టీల కేడర్‌లో జోష్ కన్పిస్తోంది. నేతల పర్యటనలను విజయవంతం చేసేందుకు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఈ నెల 21న సిఎం జగన్ నరసాపురంలో పర్యటించారు. ఈ పర్యటనలో రూ.మూడు వేల కోట్లకుపైగా విలువ చేసే పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేనలపై తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఇదేం ఖర్మరా బాబు అంటూ చంద్రబాబును ఎద్దేవా చేస్తూ సిఎం విమర్శలు చేశారు. జనసేనను రౌడీసేన అంటూ ఘాటైన విమర్శలు గుప్పించారు. వైసిపి కేడర్‌లో జోష్ నింపేలా ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేస్తూ జగన్ తన పర్యటన సాగించారు. సిఎం విమర్శలను తిప్పికొడుతూ అదే నినాదంతో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' అంటూ కార్యక్రమాన్ని టిడిపి తలపెట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా నుంచే ప్రారంభించేందుకు ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. చింతలపూడి, పోలవరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో ఈ పర్యటన సాగనుంది. రోడ్‌షో, బహిరంగ సభలతో చంద్రబాబు పర్యటన సాగనుంది. టిడిపి కేడర్‌లో జోష్ నింపి ఎన్నికలకు సమాయత్తం చేసేలా చంద్రబాబు పర్యటనను ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు తెలుగు తమ్ముళ్లు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై హామీలు గుప్పించేలా కసరత్తు చేస్తున్నారు. చంద్రబాబు పర్యటన ముగిసిన తర్వాత పవన్ కల్యాణ్ పర్యటన సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.








గెలుపోటములను నిర్ధేశించేది ఇక్కడ సీట్లే

రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి రావాలన్నా జిల్లాలోని అసెంబ్లీ స్థానాలు కీలకంగా మారుతున్నాయి. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 అసెంబ్లీ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. ఏ జిల్లాలోనూ ఈ విధంగా సీట్లు రాలేదు. మిగిలిన ప్రాంతాల్లో టిడిపికి సీట్లు తగ్గినప్పటికీ గోదావరి జిల్లాల్లో వచ్చిన సీట్లతోనే టిడిపి అధికారం చేపట్టింది. 2019 ఎన్నికల్లో జిల్లాలోని 15 స్థానాల్లో 13 స్థానాలు వైసిపి గెలుచుకుని అధికారం చేపట్టింది. ఎన్నికల్లో ఏ పార్టీనైనా ఇక్కడి ప్రజలు ఏకపక్షంగా గెలిపిస్తున్నారు. దీంతో జిల్లాపై ప్రధాన పార్టీలు కేంద్రీకరిస్తున్నాయి. 2024 ఎన్నికల్లోనూ జిల్లాలో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని టిడిపి, వైసిపి తమ వ్యూహాలు రచిస్తున్నాయి. దీంతో అధినాయకులు జిల్లాపై ప్రధానంగా దృష్టి సారించారనే చర్చ సాగుతోంది.

రైతుల సమస్యలే ప్రధాన ఆయుధం

జిల్లాలో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధాన పంటలుగా వరి, ఆక్వా ఉన్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. వర్షాలు వెంటాడుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆక్వాకు సైతం సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఇటీవల రైతులనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రైతుల సమస్యలను ప్రధాన ఆయుధంగా చేసుకుని ప్రభుత్వాన్ని ప్రజల్లో దోషిగా నిలబెట్టేలా ప్రతిపక్ష పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలు, ఆక్వా రంగంలో సమస్యలు ప్రభుత్వాన్ని కుదిపేస్తున్నాయి.



కోర్టు వద్ద నేతలు

ఆక్వా ఫుడ్‌పార్క్ ఉద్యమ కేసులు ఎత్తివేయాలి

కోర్టు వాయిదాకు హాజరైన సిపిఎం, పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

తుందుర్రులోని ఆక్వా మెగా ఫుడ్ పార్క్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటం సందర్భంగా నాటి ప్రభుత్వం బనాయించిన కేసులను తక్షణం ఎత్తివేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఆ కేసుల వాయిదా నిమిత్తం గురువారం సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు, జిల్లా కార్యదర్శి బి.బలరాం పలువురు నేతలు కోర్టుకు హాజరయ్యారు. కేసు విచారణను ఫిబ్రవరికి వాయిదా వేశారని నేతలు తెలిపారు. అనంతరం పార్టీ నేతలు కోర్టు వద్ద నుంచి నడుచుకుంటూ బస్టాండ్ వద్ద ఉన్న మీరా గ్రంథాలయానికి చేరుకున్నారు. అనంతరం ఉద్యమ నాయకులు, పార్టీ కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, కౌరు పెద్దిరాజు, ఫుడ్‌పార్కు వ్యతిరేక పోరాట కమిటీ నేతలు ఆరేటి వాసు, ముచ్చర్ల త్రిమూర్తులు, ఆరేటి సత్యవతి, బూసి కళ్యాణి, అల్లూరి అరుణ్, సముద్రాల వెంకటేశ్వరరావు, పొన్నాడ రాము, మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పటిష్టంగా స్వచ్ఛ సంకల్పం అమలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శశిధర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ అన్నారు. గురువారం అమరావతి నుండి ఆయన జగనన్న స్వచ్ఛ సంకల్పం, స్వామిత్వ, ఎన్‌ఆర్‌ఇజిఎస్, జలజీవన్ మిషన్, పిఎంజిఎస్‌వై తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై మరింత శ్రద్ధ వహించాలని శశిధర్ సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో గ్రామాలకు అందజేసిన చెత్త సేకరణ వాహనాలను సద్వినియోగం చేసుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా భీమవరం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని 368 పంచాయతీల్లో ఇప్పటికే 335 స్వచ్ఛ సంకల్పం షెడ్ల నిర్మాణాలు చేశామన్నారు. మిగిలిన 33 షెడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. దీనిలో 14 షెడ్ల నిర్మాణానికి స్థలం అవసరమని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి, డిపిఒ ఎంఎం.నాగలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎఎస్‌వి.రామస్వామి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా పాల్గొన్నారు.

డెల్టాలో జల్లులు.. రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో గురువారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. దీంతో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు పరుగులు తీశారు. చేతికొచ్చిన పంట ఎక్కడ చేజారిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షం కురిస్తే ఒక్క గింజ కూడా దక్కదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 11,350 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. దీనిలో కేవలం 20 శాతం మాత్రమే కోతలు పూర్తయినట్లు మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ తెలిపారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం తదితర గ్రామాల్లో ముమ్మరంగా పంట కోతలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

పెనుమంట్ర: గురువారం మధ్యాహ్నం నుండి మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మార్టేరు, నెగ్గిపూడి, పెనుమంట్ర, పొలమూరు, ఆలమూరుతోపాటు పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే వరి కోతలు, నూర్పిడి పనుల్లో బిజీగా ఉన్న రైతులు ఈ వర్షంతో పంట చేజిక్కించుకునేదెలా అని లబోదిబోమంటున్నారు.

పెనుగొండ: మండలంలో గురువారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలపాటు వర్షం కురిసింది. దీంతో రైతులు, జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



ఆచంట మండలంలో ధాన్యం రాశిపై బరకం కప్పుతున్న కూలీలు



పెనుగొండలో..



పెనుమంట్ర మండలం నెగ్గిపూడిలో..



పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

వ్య.కా.స రాష్ట్ర మహాసభ విజయవంతానికి సహకరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరగనున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్, ప్రముఖ న్యాయవాది మేకా ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆహ్వాన సంఘ కార్యాలయంలో మహాసభ సందర్భంగా బహిరంగసభ ప్రదర్శన, బహిరంగసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగసభలో జాతీయనేత బృందాకరత్ హాజరుకావడం హర్షణీయమన్నారు. మహాసభల నిర్వహణకు పట్టణ, పరిసర ప్రాంతాల పెద్దలు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధికి దిశా దశ నిర్దేశం చేసే విధంగా మహాసభ జరగాలని ఆకాంక్షించారు. శ్రమజీవులంతా పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, ఎ.రవి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, తెల్లం రామకృష్ణ, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, ఎం.నాగమణి, ఎ.శ్యామలారాణి, ఎస్‌కె.సుభాషిణి, పి.సూర్యారావు, తామా ముత్యాలమ్మ, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలతో రాజ్యాంగానికి తూట్లు

ఎస్ఎఫ్ఐ సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధానాలను నేటి ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక కెజిఆర్ఎల్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సేవ్ కానిస్టిట్యూషన్.. సేవ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు కె.క్రాంతిబాబు మాట్లాడుతూ 1949 నవంబర్ 26వ తేదీ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజని చెప్పారు. అయితే నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. లౌకికవాద దేశంగా ఉన్న మనదేశాన్ని మతతత్వంతో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నింపుతుందని ఆరోపించారు. దీనిలో నూతన జాతీయ విధానం-2020ను తీసుకొచ్చిందన్నారు. ఇది పూర్తిగా విద్యా వ్యవస్థను నాశనం చేసేలా ఉందని విమర్శించారు. పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ దక్కాల్సిన సంపద కొంతమంది వ్యక్తులకు మాత్రమే దక్కుతుందని చెప్పారు. ప్రజల ఆస్తిగా ఉన్న బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వే వంటి సంస్థల ప్రయివేటీకరణను ప్రభుత్వం ఆపాలన్నారు. జాతీయ నూతన విద్యావిధానాన్ని వెనక్కి తీసుకుని కొఠారి కమిషన్ విద్యావ్యవస్థను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, ఫార్మసీ డైరెక్టర్ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్‌రావు, పట్టణ అధ్యక్షులు భానుప్రకాష్, ఉపాధ్యక్షులు గౌతం సుజిత, సహాయ కార్యదర్శి దేవేంద్ర, నేతలు పవన్ మోహిని నాగేంద్ర, స్వాతి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రాంతిబాబు

అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు

భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్



ప్రజాశక్తి - ఉండి

డివిజన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ తెలిపారు. గురువారం ఆయన ఉండి పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ త్వరలోనే అన్ని పోలీసు స్టేషన్లను సందర్శిస్తానన్నారు. డివిజన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు స్వగ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

ప్రజాశక్తి - భీమడోలు

స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జన్మస్థలం గుండుగొలనులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అప్పటి ఆంధ్రాబ్యాంక్ యాజమాన్యం ఇచ్చిన హామీలను బ్యాంకును విలీనం చేసుకున్న యూనియన్ బ్యాంక్ అమలు చేయాలని గుండుగొలను పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడిపల్లి కాశీహనుమాన్ బాబు, బొల్లిన కోటేశ్వరరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సీతారామయ్య 142వ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుగొలను సొసైటీ అధ్యక్షులు వివివి.భాస్కర్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు.



పట్టాభి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

27న ఎముకలు, కీళ్ల ఉచిత వైద్య శిబిరం

ఏలూరు: రమేష్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక న్యూఅశోక్‌నగర్‌లోని కాకరాల కృష్ణమూర్తి, అన్నపూర్ణమ్మ లయన్స్ క్లబ్ కాంప్లెక్స్‌లో ఈ నెల 27న ఉచిత ఎముకలు, కీళ్ల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రమేష్ హాస్పిటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు, తిరుపతి బర్డ్స్ ఆసుపత్రి మాజీ సంచాలకులు డాక్టర్ గుడారు జగదీష్, వారి సహచర ఆర్థోపెడిక్ వైద్య నిపుణుల బృందంతో ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 7288811515, 8501898989 నంబర్లను సంప్రదించాలన్నారు.

వాలంటీర్లు పారదర్శకంగా సర్వే చేపట్టాలి

మొగల్తూరు: వాలంటీర్లు పారదర్శకంగా సర్వే చేపట్టాలని ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్ కుమార్ సూచించారు. ఉన్నతాధికారులు 8 అంశాలపై సర్వే చేయాలని సూచించడంతో గురువారం ముత్యాలపల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత కలిగిన 19 సంవత్సరాల వారు, గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులు తదితర విషయాలపై ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి ప్రత్యేక యాప్ డౌన్లోడ్ చేయాలన్నారు. వాలంటీర్లకు అందించిన ప్రశ్నలపై సర్వే పారదర్శకంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నవీన్ కిరణ్, కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఆనందకుమార్

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామ సంఘాల్లో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని తణుకు ఐకెపి సీసీ డి.బంగారయ్య స్పష్టం చేశారు. స్థానిక ఐకెపి కార్యాలయంలో గురువారం సిఎల రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బంగారయ్య మాట్లాడుతూ మహిళల పురోభివృద్ధి డ్వాక్రా సంఘాల ద్వారా ఎంతవరకూ సాధ్యమవుతోందీ లేనిదీ ఏడాదిలో ఆరు నెలలకోసారి పరిశీలించనున్నట్లు తెలిపారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, సిఎలు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ క్లబ్, చవాకుల ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వీవర్స్ కాలనీ, వడలివానిపేట, హౌసింగ్ బోర్డు తదితర మున్సిపల్ పాఠశాలలకు గురువారం ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు చవాకుల నరేష్‌బాబు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణ, రూరల్ స్కూళ్లకు కలిపి వంద కిట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంపట్ల రాజా, ఇనుకొండ శేషాద్రి, హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

పిసిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హరికిరణ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పిసిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాలకొల్లుకు చెందిన పిసిసి సభ్యులు కొరగింజల హరికిరణ్ నియమితులయ్యారు. గురువారం పిసిసి అధ్యక్షులు శైలజానాథ్ నుంచి సమాచారం అందింది. ఏలూరుకు చెందిన బిడి రవికుమార్, కృష్ణను పిసిసి కార్యదర్శులుగా నియమించారు. నరసాపురానికి చెందిన కృష్ణంరాజు, ఏలూరుకు చెందిన వనచర్ల లింగస్వామిని జాయింట్ సెక్రటరీలుగా నియమించారు. ఈ సందర్భంగా హరి కిరణ్‌ను పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు అభినందించారు.

నూతన విధానంతో రైతులకు మేలు : ఎఒ

ప్రజాశక్తి - పెనుగొండ

నూతన విధానంతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి స్పందన తెలిపారు. గురువారం నడిపూడి రైతు భరోసా కేంద్రం వద్ద ఆమె రైతులతో మాట్లాడారు. పంటను ధాన్యం సంచుల్లో పట్టి ట్రాక్టర్‌కు ఎగుమతి చేసే బాధ్యత రైతులదే అన్నారు. రైతుకు, మిల్లర్లకు సంబంధం లేకుండా అధికారులే రైస్ మిల్లులకు ధాన్యం పంపిస్తారని తెలిపారు. తేమ 17 శాతం ఉండాలన్నారు. రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అనంతరం కౌలు రైతులు తమ సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. పాత పద్ధతి ద్వారానే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. క్లీనర్ మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేరాలు - ఘోరాలు


మృతి చెందిన చరణ్ తేజ

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా క్లీనర్ మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలోని శశి పాఠశాలకు చెందిన స్కూల్ బస్సులో కొండ్రు ప్రోలు గ్రామానికి చెందిన కందెల్లి చరణ్ తేజ (15) క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం చరణ్ తేజ బస్సు కింద శుభ్రం చేస్తుండగా డ్రైవర్ నాని అది గమనించకుండా బస్సును వదిలాడు. దీంతో చరణ్‌తేజ వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు నిర్లక్ష్యంగా నడిపి బాలుడు మృతికి కారకుడైన డ్రైవర్ నాని తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చిన్న వయసులోనే కుటుంబాన్ని పోషించడానికి క్లీనర్‌గా పనిచేస్తున్న చరణ్ తేజ మృతి ఆ కుటుంబాన్ని కలచివేసింది. చరణ్‌తేజ మృతిని సుమోటో కేసుగా నమోదు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు మెరిపో జాన్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం రవీంద్రబాబు డిమాండ్ చేశారు. తేజ మృతి శశి యాజమాన్యమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ సైన్స్ రచయిత డాక్టర్ సివి సర్వేశ్వరశర్మ తెలిపారు. లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ మహాసభకు సర్వేశ్వరశర్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో మెదడుకు మించిన సోమరిపోతు మరొకటి లేదన్నారు. మెదడుతో పని చేయించుకోవాలంటే దాని దర్శిక వాదాన్ని జయించే నైపుణ్యం అలవర్చుకోవాన్నారు. షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ కర్రి హరీష్, ప్రధానోపాధ్యాయులు జిబి.జయప్రసాదరావు మాట్లాడుతూ డాక్టర్ సర్వేశ్వర శర్మను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యా సంస్థల నిర్వాహకుడు సిహెచ్ ప్రకాష్, వివిఎస్‌బి.సుబ్రహ్మణ్యం, సుధీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నాగేశ్వరరావును అభినందిస్తున్న బిసి సంఘం నాయకులు

బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం

ప్రజాశక్తి - పాలకోడేరు

బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రచార కమిటీ అధ్యక్షుడు ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పాలకోడేరులో బిసి సంఘాల నాయకులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంఘాల నాయకులు కొత్తగా ఎన్నికైన ఆళ్ల నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 139 బిసి కులాలు ఐక్యంగా ఒకే తాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందరూ ఒకే మాట మీద ఉంటే రాజ్యాధికారం సాధించడంతోపాటు అందరూ అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఆళ్ల అప్పలరాజు, తొలగించబడిన 26 బిసి కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, చరకణం వెంకటేశ్వరరావు, కె.శివప్రసాద్, మల్ల శివయ్య, ఆళ్ల చంటి, చిలపరశెట్టి వరప్రసాద్, జుత్తిగ పెద్దిరాజు, షేక్ మస్తాన్ గులిపల్లి సత్యనారాయణ, హరి పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి రూ.76.07 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గునుపూడిలోని సోమేశ్వర జనార్ధన స్వామి వారి దేవస్థానానికి కార్తీకమాసం సందర్భంగా దర్శనాలు, యాత్రికులు హుండీలో వేసిన విరాళాలు, అన్నదానం నిమిత్తం మెత్తం రూ.76,07,486 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. కార్తీక మాసం పూర్తవ్వడంతో ఆలయ హుండీల లెక్కింపు గురువారం నిర్వహించామన్నారు. ఈ లెక్కింపు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కోడే విజయలక్ష్మి యుగంధర్ పరిరక్షణలో ధర్మకర్తలు పాల్గొన్నారని, తాళ్లమ్మ ఆలయ అధికారి జి.సత్యనారాయణ పరిరక్షణలో లెక్కింపు పూర్తిచేసినట్లు తెలిపారు.

అధ్వానంగా లింకు రోడ్లు!

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో వివిధ గ్రామాలను కలిపే లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలో పలు చోట్ల లింకు రోడ్లకు మోక్షం కలగకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రామన్నపాలెం నుంచి కాండేకులంక వరకూ రెండు కిలోమీటర్లు వరకూ, మలపర్రు నుంచి దేవ వరకూ, ఇలపర్రు పంచాయతీ నుంచి ఆంబోతుల దెబ్బను కలుపుతూ ఉన్న లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై రాళ్లు పైకి లేచి ఉండడంతో రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు నరకయాతన పడుతున్నామని వాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాధుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.


అధ్వానంగా ఉన్న లింకు రోడ్డు

19 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోళ్లు : ఎఒ మాధురి

ప్రజాశక్తి - పెనుమంట్ర

19 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని ఎఒ మద్దాల జయదుర్గా మాధురి తెలిపారు. గురువారం పెనుమంట్రలో రైతుల వద్ద ధాన్యం సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాధురి మాట్లాడుతూ ఇప్పటివరకూ మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణ బాగా జరిగినట్లు తెలిపారు. మండలంలో 12,315 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారని, ఎక్కువగా 1318 రకాన్ని రైతులు సాగు చేశారని తెలిపారు. అలాగే ఎంటియు 7029 స్వర్ణ రకాన్ని మండలంలో 10 శాతం మాత్రమే సాగు చేశారని తెలిపారు. స్వర్ణ రకం కోతకొచ్చిందని, రైతులు తమ ధాన్యాన్ని ఆర్‌బికెల్లో అమ్మాలని మండల స్థాయి కమిటీ తెలియజేస్తుందని అన్నారు. అయితే ఇప్పటివరకూ 19 రైతుభరోసా కేంద్రాల్లో 1251.40 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. తేమ శాతం పరీక్షించిన వెంటనే రైతులకు గోనె సంచులు అందజేస్తారని తెలిపారు. ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదిస్తే వెంటనే వారు మిల్లులకు తరలిస్తారని తెలిపారు. క్వింటాకు హమాలీ ఖర్చుల కింద రూ.25, రవాణా ఖర్చు కింద రూ.324 టన్నుకు ఎనిమిది కిలోమీటర్ల లోపు వారికి ఇవ్వనున్నట్లు తెలిపారు. తేమ శాతం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. రైతుల ఖాతాలకే నేరుగా ధాన్యం సొమ్ము జమచేస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న మద్దాల జయదుర్గామాధురి


అండలూరులో పది పరీక్ష ఫీజు మొత్తాన్ని అందజేస్తున్న దాత

పది విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో రెండు హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష ఫీజుకు సంబంధించి మొత్తాన్ని దాత ఆయా ప్రధానోపాధ్యాయులకు గురువారం అందజేశారు. నిమ్మల సుబ్రహ్మణ్యం, సరస్వతి కుమార్తె నితీక్ష పుట్టిన రోజును పురస్కరించుకుని హెల్పింగ్ ఆర్ట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ద్వారా నగదు అందజేశారు. ఈ మొత్తాన్ని అండలూరు తూటే విజయకుమార్ ప్రోత్సాహంతో అండలూరులో పదో తరగతి చదువుతున్న నలభై మంది విద్యార్థులకు రూ.ఐదు వేలు, తోలేరు హైస్కూల్లో 65 మంది విద్యార్థులకు రూ.8125 ఆయా స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్యాంప్రసాదుకు, అందే రామకోటేశ్వరరావు అందజేశారు. దాతకు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చలి పెరగడంతో వృద్ధులకు, పేద బ్రాహ్మణులకు రగ్గులు పంపిణీ చేసినట్లు జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ తెలిపారు. గురువారం ఉమా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద రగ్గులు, చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉమా సోమేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కోడే విజయలక్ష్మి యుగంధర్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి స్వామి దర్శనానికి నిత్యం వేలాదిమంది యాత్రికులు వచ్చేవారని తెలిపారు. నెల రోజులు యాత్రికులకు విశేష సేవలందించిన ఇఒ అరుణ్‌కుమార్‌కు, ధర్మకర్తలకు, పురోహితులకు, పోలీసులకు, హెల్త్, ఆలయ సిబ్బందికి, ఎన్‌సిసి వాలంటీర్లకు, మున్సిపల్ అధికారులకు, పారిశుధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

సిపిఎం నేత పీర్లస్వామి మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు


పీర్లస్వామి (ఫైల్‌ఫొటో)

శృంగవృక్షం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ సభ్యులు గణేశుల పీర్లస్వామి (78) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న స్వామి పరిస్థితి విషమించడంతో ఆయన స్వగృహం వద్ద మృతి చెందారు. సిపిఎం సభ్యులుగా పనిచేశారు. ముఖ్యంగా పార్టీ గ్రామ శాఖలో కీలకపాత్ర పోషించారు. రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తూనే కార్మికుల సమస్యలపై జరిగిన ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొనేవారు. పీర్లస్వామి మృతి చెందడం పట్ల సిపిఎం సంతాపం తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, జుత్తిగ నరసింహ మూర్తి, మండల కార్యదర్శి శేషాపు అసిరియా, నాయకులు పల్లెం భీమన్న, కొటికలపూడి శ్రీను, పీర్లస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పీర్లస్వామి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడారు. సిపిఎం పార్టీ సభ్యునిగా ఏళ్ల నుంచి పార్టీకి, ప్రజా ఉద్యమానికి ఎన్నో సేవలు అందించారని తెలిపారు. ఆయన మృతి బాధాకరమన్నారు.

సిఎం చేతుల మీదుగా షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరణ ఆనందకరం

ప్రజాశక్తి - ఆచంట


షార్ట్ ఫిల్మ్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం జగన్

నా దర్శకత్వంలో రూపొందించిన శ్రీకారం షార్ట్ ఫిల్మ్ ఇటీవల నరసాపురం విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకారం షార్ట్ ఫిల్మ్‌ను గత నెలలో పెనుగొండ మండలం ఇలపర్రులో శతమానం భవతి సినిమా తీసిన పింకుటింట్లో ఘనంగా ప్రారంభించామన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం నాయకులు అరిగెల సురేష్ బాబు, ముడకల నానిబాబు, దాసరి ప్రశాంతి పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజా సేవకుడు అప్పారావు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - వీరవాసరం


అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

నిస్వార్థ ప్రజాసేవకుడు కిల్లాడ అప్పారావు అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. కిల్లాడ అప్పారావు మూడో వర్ధంతిని ఆయన స్వగ్రామం ఉత్తరపాలెంలో గురువారం నిర్వహించారు. ఉత్తరపాలెం బిసి కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ అప్పారావుకు వ్యక్తి గతంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తన ఆర్థిక పరిస్థితులను సైతం లెక్కజేయకుండా ప్రజల కోసం పాటుపడిన వ్యక్తి అన్నారు. నలభై సంవత్సరాల పాటు నిరంతరంగా ప్రజా సమస్యల పట్ల పోరాటం చేసిన వ్యక్తి అప్పారావు అన్నారు. కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరలిపోకుండా జరిగిన ఉద్యమంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. తనతో పాటు తన తనయులను కూడా ఎర్రజెండా నీడకు చేర్చడం ఆయనకు పార్టీ పట్ల ఉన్న అంకుటిత దీక్షకు నిదర్శనమన్నారు. రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తన తండ్రి అప్పారావు తానూ ప్రజా ఉద్యమాల్లో పని చేయడానికి స్ఫూర్తినిచ్చారన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడానికి పాటుపడతానన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అప్పారావు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కేతా జ్యోతిబసు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జుత్తిగ సాంబియాంభ, కవురు సుబ్బారావు, పాలా అజయ్‌ఘోష్, పాలా కోటేశ్వరరావు, నున్నబోయిన సత్యనారాయణ, పాలా కోటేశ్వరరావు, మైగాపుల నారాయణమూర్తి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి : జనసేన



నినదిస్తున్న జనసేన నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఉండి

రైతులకు న్యాయం చేయాలని జనసేన నియోజకవర్గ ముఖ్య నాయకులు జుత్తిగ నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గురువారం జుత్తిగ నాగరాజు ఆధ్వర్యంలో రైతన్నలకు అండగా నిరసన కార్యక్రమాన్ని జన సైనికులు చేపట్టారు. ఉండి మెయిన్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రైతే రాజు, దేశానికి రైతే వెన్నెముక అనే పదాలు వాడుకలోనే ఉన్నాయి తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదని తెలిపారు. తేమ శాతం అధికంగా ఉందనే సాకుతో ప్రభుత్వం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయట్లేదన్నారు. ప్రభుత్వం వారి నుంచి ధాన్యం కొనుగోలు చేసి నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ఎరువులు, పురుగుమందులు రాయితీపై అందజేశాయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండల అధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు, కొటికలపూడి తాతాజీ, ఎరుబండి రామాంజనేయులు, గాదం నానాజీ పాల్గొన్నారు.

చలో రాజమండ్రి ర్యాలీకి తరలిరండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 25న చేపట్టనున్న చలో రాజమండ్రి ర్యాలీ కార్యక్రమానికి జిల్లా నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశం సిపాయిపేటలోని సంఘం కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మహాసభల సందర్భంగా జిల్లాలో అనుబంధ సంఘాలన్నీ విస్తృతప్రచారం నిర్వహించాయన్నారు. కార్మికుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. శనివారం రాజమండ్రిలో జరగనున్న భవన నిర్మాణ కార్మికుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికోద్యమంలో ప్రస్తుత జాతీయ మహాసభకు చాలా ప్రాముఖ్యం ఉందన్నారు. మహాసభ నిర్ణయాలకు అనుగుణంగా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంకం భాస్కరరావు, జిల్లా కోశాధికారి మెండెం జేమ్స్, ఏరియా కమిటీ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ మాట్లాడారు. యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోడె సాయిబాలాజీ, మాధవరం గ్రామసంఘం నాయకులు పాల్గొన్నారు.

దళితవాడల్లో సౌకర్యాలు కల్పించాలి

పోడూరు: మండలంలోని పెనుమదం, రేజర్ల దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ శాఖా సమావేశం రేజర్ కనకమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ రేజర్లపేటలో వాడకంనీరు బయటకెళ్లే మార్గం లేదన్నారు. సమావేశంలో పిట్టా ముసలయ్య, నాగేశ్వరరావు, పెద్దిరాజు పాల్గొన్నారు.